విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

స్పందనలో 209 అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర - ఏలూరు : ప్రజల్లో సంతృప్తిస్థాయి పెంచే విధంగా స్పందన అర్జీల పరిష్కారం ఉండాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమ వారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్వీకరించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 209 అర్జీలు అందాయని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు, డిఆర్వో ఏవీ సత్యనారాయణమూర్తి, ఏలూరు ఆర్డిఓ కె. పెంచల కిషోర్, డిఆర్డిఏ పిడి విజయ రాజు, తదితరులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ

విశాలాంధ్ర - ఏలూరు క్రైమ్ : నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్ పి రాహుల్ దేవ్ శర్మ సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశం మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు.స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను స్వీకరించి వారి సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా ఫిర్యాదిదారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులంన్నింటి పై సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో ఆదేశాలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని చేసే ప్రకట నల పట్ల నిరుద్యోగ యువత అప్రమత్తతో ఉండాలన్నారు.

స్పందన ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : జేసీ

విశాలాంధ్ర -భీమవరం: ఫిర్యాదు దారులు వారిచ్చే ఫిర్యాదులపట్ల సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికార్లను జిల్లా జాయింటు కలెక్టరు జేవీ మురళి ఆదేశించారు. స్థానిక కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు పరిష్కారానికి వచ్చిన ప్రజల నుంచి జిల్లా జాయింటు కలెక్టరు వినతులను స్వీకరించారు. 180 దరఖాస్తులు వచ్చాయ న్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు, డియంహెచ్‌వో డాక్టరు డి.మహేశ్వర రావు, డిపిఓ యం. నాగలత, ఐసిడియస్ పిడి బి. సుజాతా రాణి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

గణిత ఉపాధ్యాయులు శివరాం ఇకలేరు

విశాలాంధ్ర-ఆగిరిపల్లి : ఆగిరిపల్లి జడ్పీహెచ్ స్కూల్ గణిత ఉపాధ్యాయులు శివరాం మృతి చెందారు. 10వ తరగతి లెక్కలు ఉపాధ్యాయునిగా కొనసాగుతున్నారు. శుక్రవారం హై స్కూల్లో బెంచ్ బల్ల తగిలి కింద పడగా కాలు విరిగింది. మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. సోమవారం గుండెపోటుతో ఆసుపత్రిలో మరణించారు. ఉత్తమ ఉపాధ్యా యుడ్ని కోల్పోయినందుకు బాధాకరంగా ఉందని ఉపాధ్యా యులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

దివ్యాంగుల సేవాసమితి వితరణ

విశాలాంధ్ర - భీమడోలు : దివ్యాంగులను ఆదుకుంటున్న విఘ్నేశ్వర సేవాసమితి సేవలు అభినందనీయమని గుండుగొలను దివ్యాంగ సంఘం నాయ కులు అన్నారు.సోమవారం గుండు గొలను గ్రామంలోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాం గుల సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామంలోని 50 మంది దివ్యాంగులకు బియ్యం, పోషక పదార్థాలు, పండ్లను, 200 మందికి అన్నదానాన్ని గ్రామానికి చెందిన దాతలు ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా దాతలను సేవాసమితి సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు గేదెల శ్రీనివాసరావు, శ్యామలరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్య.కా.సం మహాసభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - కలిదిండి : డిసెంబర్ 8, 9,10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ పిలుపు నిచ్చారు.సోమవారం కలిదిండిలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎస్. మహంకాళిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు, పేదలు సమస్యలపై తమ వంతు మద్దతుని తెలుపుతున్నది వ్యవసాయ కార్మిక సంఘం అని అన్నారు. జంగారెడ్డిగూడెంలో జరుగు ఈమహాసభలను జయప్రదం చేయడానికి ఉద్యో గులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు రైతాంగం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశం లో జె. మహేష్, చిన్నం శ్రీకాంత్, పి.సత్యనారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర - నూజివీడు టౌన్: మండలంలోని తుక్కులూరు జేబీఎల్ హోమ్‌లో ఉంటున్న వృద్ధులకు నూజివీడు ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి సొంత ఖర్చులతో సోమవారం డిఎస్పి బి. శ్రీనివాస్ చేతుల మీదుగా భక్తులకు ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సీనియర్ సిటిజన్లను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులకు ఆశ్రయం కల్పించిన జీబీఎల్ హోం నిర్వాహకులను కొనియాడారు. శరణాలయంలో ఉంటున్న 70 మంది వృద్ధులకు ఒక పూట ఆహారాన్ని అందించిన ట్రాఫిక్ ఎస్ఐ రాధా కృష్ణారెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ, ఎస్సై టి. రామకృష్ణ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

SRI VASAVI ENGINEERING COLLEGE

(An Autonomous Institute permanently affiliated to JNTUK, Kakinada)

(Accredited by NAAC with 'A' Grade & NBA Accreditation for 4 UG Programmes)

Pedatadepalli, TADEPALLIGUDEM - 534 101. W.G.Dist. (A.P.)

B.TECH. LATERAL ENTRY (APECET-2022) SPOT ADMISSIONS

A few left over/not reported/dropout seats in **B.Tech. Lateral Entry (Civil/EEE/MECH/ECE/CSE) under Convenor Quota/1st year left over Management Quota,** are available for institutional spot admissions.

Spot Admissions will be conducted for the vacant seats on **08-11-2022.** Eligible Candidates who are interested and not taken admission anywhere so far can attend for institutional spot admissions on that day along with all original certificates and necessary fees. Admissions will be made as per the rules and guidelines given by **Convenor, APECET-2022/APSCHE.**

Ch.V.V.Subba Rao, B.Sc., Secretary & Correspondent.

అక్టోబర్ విప్లవస్ఫూర్తితో పోరాటాలు

ఏలూరులో

భీమవరంలో

విశాలాంధ్ర - ఏలూరు /భీమవరం : అక్టోబర్ విప్లవస్ఫూర్తితో పోరాటాలను కొనసాగించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. 1917 అక్టోబర్‌లో జరిగిన మహత్తర అక్టోబరు సోషలిస్టు ఉద్యమ విజయోత్సవ కార్యక్రమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఏలూరు ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం అత్యంత ప్రభావాన్ని ప్రపంచం మీద చూపించిందని కొనియాడారు.అనేక దేశాలు అక్టోబర్ సోషలిస్టు విప్లవస్ఫూర్తితో సోషలిస్టు,కమ్యూనిస్టు దేశాలుగా ఏర్పడ్డాయని అంతటి గొప్ప స్ఫూర్తితో భారతదేశంలో కూడా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, మావూరి విజయ, కొల్లూరి సుధారాణి, పోలా భాస్కరరావు, తెర్లాపు శ్రీను, కురెళ్ళ వరప్రసాద్, సాయన బాలు, గన్ను వెంకట్రావు,ఉప్పులూరి రవి, వీర్ల జగన్నాథం, యర్రా వెంకటేశ్వరరావు,కనకం జగన్మోహన్రావు, ఎం.ఏ హకీమ్, అజీజ్,గొర్లి స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవుల రాజ్యానికి బాటలు వేసిన రష్యన్ విప్లవం

ప్రపంచంలో పెట్టుబడి దారుల దోపిడీ అంతానికి శ్రమజీవుల రాజ్యానికి బాటలు వేసిన మహత్తర విప్లవం 1917 రష్యన్ సోషలిస్టు విప్లవమని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు.రష్యన్ సోషలిస్టు విప్లవం 105 వ వార్షికోత్సవాన్ని సోమవారం భీమవరంలో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కమ్యూనిస్టు ఉద్యమ పితామహులు కారల్ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ పెట్టుబడి దారుల దోపిడీ అంతానికి కారల్ మార్క్స్, ఎంగెల్స్ లు రచించిన కమ్యూనిస్టు, మార్క్సిస్టు సిద్ధాంతాల ప్రాతిపదికగా రష్యాలో లెనిన్ మహాశయుడు కార్మికులను, రైతులను ఏకం చేసి సోషలిస్టు సమాజ స్థాపన దిశగా విప్లవోద్యమం నిర్మించారన్నారు. సీపీఐ భీమవరం పట్టణ కార్యదర్శి సిహెచ్ రంగారావు మాట్లాడుతూ రష్యన్ సోషలిస్టు విప్లవం బానిసత్వ విముక్తికి నాందీగా నిలిచిందన్నారు. సీపీఐ భీమవరం మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ రష్యన్ సోషలిస్టు విప్లవం ప్రపంచంలో పెట్టుబడిదారీ సమాజం వెన్నుల్లో వణుకు పుట్టించిందన్నారు. మహిళా సమాఖ్య పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస్, యేలేటి విజయానంద్, ఆకలి రాము,తిరుమాని కామేశ్వరరావు,పాలా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో: అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా సోమవారం నూజివీడు అమరభవన్లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ విప్లవం విజయవంతం కావడంతో నిజమైన అధికారం ప్రజలకు దక్కిందన్నారు. దోపిడీ లేని సామాజిక వ్యవస్థ నిర్మాణానికి అక్టోబర్ విప్లవం ప్రపంచ పీడిత ప్రజలకు గొప్ప స్ఫూర్తినిచ్చిందన్నారు. అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ప్రపంచంలో అనేక దేశాలు సోషలిజమే లక్ష్యంగా పురోగమిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ టౌన్ సెక్రటరీ చాట్ల పుల్లారావు, అరసం జిల్లా కార్యదర్శి సికాప్, వీరభద్రరావు, ముఖర్జీ, శేషయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో : స్థానిక సీపీఐ కార్యాలయం కపర్ది భవనంలో సీపీఐ ఏరియా కన్వీనర్ మండల నాగేశ్వరరావు , పెంటపాడు మండలం కార్యదర్శి కళింగ లక్ష్మణ రావు ఆధ్వర్యంలో రష్యన్ విప్లవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, లక్ష్మణరావు మాట్లాడుతూ 105 సంవత్సరాలకు ముందే కార్మికు లను దోచుకుంటున్న జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా కారల్ మార్క్స్ పోరాటం చేసారన్నారు. హక్కుల కోసం పోరాటం చేసి కార్మికుల హక్కులను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లం రాము, తాడికొండ గంగా భవాని, తాడికొండ యేసురాజు, వడ్డాది మేరీ, మొండేటి వసంత, బి. లక్ష్మి నారాయణ,ఉల్లింకల జయకృష్ణ, జలపర్తి వెంకటరావు,జీవ రత్నం ,కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు మీరిపో జాన్రాజు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో: రష్యన్ సోషలిస్టు విప్లవం 105 వ వార్షికోత్సవాన్ని సోమవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్ భూపతిరాజు సుబ్బరాజు సమావేశ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, తణుకు ఏరియా కన్వీనర్ టి. అప్పలస్వామి మాట్లాడారు. పెట్టుబడిదారుల దోపిడీ అంతానికి కారల్ మార్క్స్, ఎంగెల్స్ లు రచించిన కమ్యూనిస్ట్, మార్క్సిస్ట్ సిద్ధాంతాల ప్రాతిపదికగా రష్యాలో లెనిన్ మహాశయుడు కార్మికులను, రైతులను ఏకం చేసి సోషలిస్టు సమాజ స్థాపన దిశగా విప్లవోద్యమం నిర్మించా రన్నారు. ఈ కార్యక్రమంలో బండి సత్యనారా యణ, బొద్దాని మురళీకృష్ణ, పెండ్యాల దత్తాత్రేయ ప్రసాద్, పొట్టి అమ్మిరాజు, బొద్దాని కృష్ణ కిషోర్, నమ్మి రాజు, ఉండ్రాజవరపు మురళీకృష్ణ, కోరాడ సుదీర్ బాబు, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో : కమ్యూనిస్టుపార్టీ యోధుడు, విప్లవ వీరుడు లెనిన్ నాయకత్వంలో రష్యా లో బోల్షెవిక్ విప్లవం ద్వారా అప్పటి జార్ చక్రవర్తి సామ్రాజ్యాన్ని కూల్చడం వల్ల సోషలిస్ట్ రాజ్యం ఏర్పడిందని సీపీఐ మండల కార్యదర్శి జే.వి.రమణ రాజు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణ రాజు మాట్లాడారు. విప్లవ వీరుడు లెనిన్ ఆనాడు చేపట్టిన విప్లవ స్ఫూర్తి తోనే ప్రపంచంలో అనేక దేశాలతో పాటు భారత దేశంలో కూడా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవిం చిందని అన్నారు. సీపీఐ శ్రేణులు లెనిన్ ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కుంచె వసంత రావు,మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, కలపాల శ్రీరాములు, తాళ్లూరి నాగరాజు, కే.ప్రసాద్, హనుమంతు, మారేసు, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో : విప్లవ స్ఫూర్తితో పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నవంబర్ విప్లవం విజయోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో టీవీఎస్ రాజు మాట్లాడుతూ లెనిన్ మరణానంతరం జరిగిన పరిణామాల్లో రెండో ప్రపంచయుద్ధంలో స్టాలిన్ నాయకత్వాన హిట్లర్ నియంతృత్వాన్ని తరిమికొట్టి అనేక దేశాల్లో సోషలిజం స్థాపించడంలో స్టాలిన్ పాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి జి. సత్యనారాయణ. అడప సత్యనారాయణ. ఎం. అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో: నిరుపేదల కోసం సీపీఐ నిరంతరం అనేక పోరాటాలు కొనసాగిస్తుందని మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద వెలగల రామారావు అధ్యక్షతన సోషలిస్టు విప్లవ దినోత్సవం జరిగింది. ఈ సమా వేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస రావు మాట్లాడుతూ లెనిన్ నాయకత్వంలో జార్ చక్రవర్తి సామ్రాజ్యాన్ని కూల్చిన తర్వాత రష్యాలో సోషలిస్టు రాజ్యం ఏర్పడిందన్నారు.

నూజివీడులో

తాడేపల్లిగూడెంలో

తణుకులో

జంగారెడ్డిగూడెంలో

కామవరపుకోటలో

కొయ్యలగూడెంలో

కుక్కునూరులో

ప్రపంచ దేశాలలో కూడా కమ్యూనిస్టు పార్టీ నిరుపేదల, కార్మికుల, కష్టజీవుల హక్కుల పరిరక్షణ కోసం అలుపెరు గని పోరాటాలు కొనసాగిస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి తాడిగడప అంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్ కే బాజీ, నక్క లక్ష్మణరావు, మట్ల రామకృష్ణ, ఎస్. గిరి, రాంబాబు, గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో : శ్రామిక వర్గానికి, సామాన్య ప్రజలకు, అభ్యుదయ వాదులం దరికీ , అక్టోబర్ విప్లవం స్ఫూర్తినిచ్చిందని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యులు మైసాక్షి వెంకటాచారి అన్నారు. 1917లో రష్యాలో అక్టోబర్ విప్లవం విజయ వంతమై ప్రపంచంలోనే ప్రప్రథమ సోషలిస్టు రాజ్యం ఏర్పడిన సందర్భంగా, సీపీఐ కుక్కు నూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోవియట్ విప్లవం నూతన సమాజానికి నాంది పలికిందన్నారు. దోపిడీ నుంచి విముక్తి కల్పిస్తూ శ్రామిక పీడిత ప్రజల్లో ఆశను విశ్వాసాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, బాబురావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి)రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సి. పుల్లారావు డిమాండ్ చేశారు.ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) నూజివీడు మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశం ముత్యాల నాగేంద్రరావు అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న భజంత్రీ శ్రీనివాసరావు, పుల్లారావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నాటి ప్రతిపక్ష నాయకులు ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయని పక్షంలో రానున్న కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈనెల 13వ తేదీ ఆదివారం నూజివీడు మున్సిపల్ పట్టణ కమిటీ మహాసభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ పట్టణ నాయకులు ముత్యాల నాగేంద్రరావు, నాగేశ్వరరావు, రవికుమార్, మోచర్ల జయరాం, సింగంపల్లి రవీంద్రబాబు,ఎల్. నారాయణ, బంగారు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో ఆన్‌లైన్ సమస్య

విశాలాంధ్ర - లింగపాలెం : తపాలా కార్యాలయాలలో ఆన్‌లైన్ తరచూ సమస్యలు రావటంతో లావాదేవీలు నిలిచి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింగపాలెం మండలంలో ధర్మాజీగూడెంలోని ప్రధాన తపాలా కార్యాలయం, గ్రామాలలోని బ్రాంచి కార్యాలయాల్లో తరచూ ఆన్‌లైన్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ కార్యాలయాలలో లావాదేవీలు చేసుకునే ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక మంది ఈ కార్యాలయంలోనే నగదు లావాదేవీలు కొనసాగిస్తుంటారు. ఎంతోకాలంగా ఆన్‌లైన్ సమస్య ఉన్నా పరిష్కరించకపోవటంతో ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అగ్నిమాపక అధికారి రామారావును అరెస్టు చేయాలి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : కులం పేరుతో సాగర్ బాబును దూషించిన అగ్నిమాపక అధికారి రామారావు, ఇద్దరు ఫైర్ సిబ్బందిని విధుల నుంచి తప్పించి, తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద దళిత ప్రజా సంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి ప్రభుత్వ కార్యాలయాల్లో కుల వివక్ష కొనసాగడం దారుణమన్నారు. తాడేపల్లిగూడెం అగ్నిమాపకశాఖ కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్న సాగర్ బాబును అగ్నిమాపక అధికారి రామా రావు కులం పేరుతో దూషించి, వివక్షకు గురిచేయడం పట్ల తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.తక్షణమే రామారావును ఆయనకు అనుకూలంగా వ్యవహరించిన ఇద్దరు సిబ్బందిని అరెస్ట్ చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ అప్పారావుకు, టౌన్ సిఐ నాగరాజుకు వినతి పత్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉ లింకల జయకృష్ణ, బి.లక్ష్మీనారాయణ, గంగాభవాని, జాలిపర్తి వెంకట్రావు, దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి లక్ష్యాలతోనే దేశాభివృద్ధి

విశాలాంధ్ర- నూజివీడు : ఉమ్మడి లక్ష్యాలు ,ప్రయోజనాలు అర్థ మయ్యే దాన్ని సాధించే నేర్పరితనం ,ఇంగిత జ్ఞానం ఉన్న వాళ్ళు లక్షలాదిమంది ఉంటే దేశం బాగుపడుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు . సోమవారం నూజివీడులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాలల, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతో జయప్రకాష్ నారాయణ ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ, జగన్,కేసీఆర్ లాంటి వారు ఉంటే దేశం బాగుపడుతుందనేది కల అన్నారు. మనుషులు నీతి వాక్యాలు చెప్పడం కాకుండా ఆలోచించి చేయగలిగే శక్తిని పెంపొందించే సత్తా ఉండాల న్నారు. సమస్య నుండి పరిష్కారాలు ఎలా సాధించాలి అనేది నేర్చుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు శ్రీనివాస్, చెన్నారావు ,రాజగోపాల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ నూతన అంబులెన్స్ ప్రారంభం

విశాలాంధ్ర - ఏలూరు : రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో కెనడియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన నూతన రెడ్ క్రాస్ అంబులెన్స్ ను జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ వె. ప్రసన్న వెంకటేష్ సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ విపత్తుల సమయాలలో, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడానికి, అత్యవసర పరిస్థితుల్లోని రెడ్ క్రాస్ అంబులెన్స్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రెడ్ క్రాస్ సొసైటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జెసి పి.అరుణ్ బాబు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఏ.వి. సత్యనారాయణ మూర్తి,ఆర్డీవో కె. పెంచల కిషోర్, జడ్పీ సీఈవో రవికుమార్, మునిసిపల్ కమిషనర్ షేక్ షాహిద్,రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

రవిబాబు అరెస్ట్ అప్రజాస్వామికం

విశాలాంధ్ర -ఉండి : నరసాపురం పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి బురిడి రవిబాబు అరెస్ట్ అప్రజాస్వామికమని ఉండి ఎమ్మెల్యే మంతెన రామ రాజు మండిపడ్డారు. భీమవరంలోని సబ్ జైల్లో ఉన్న రవిబాబును ఎమ్మెల్యే మంతెన రామరాజు, టీడీపీ నాయకులు పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రామరాజు మాట్లాడుతూ టిడిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్న రవిబాబుపై అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అధికార అహంభావంతో, పోలీసుల సహాయంతో అక్రమ కేసులు బనాయించి జైల్లో వేయించారని అన్నారు. మండలంలోని అర్తమూరు గ్రామంలో జరిగిన ఒక గొడవలో ఎటువంటి సంబంధం లేని రవిబాబును ఉద్దేశపూర్వకంగా ఇరికించి అక్రమ అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్ట్ పై ప్రైవేట్ కేసు వేసి టిడిపి తరపున న్యాయ పోరాటం చేస్తామన్నారు.ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కాగిత మహంకాళి, దుంపగడప శ్రీనివాసరావు, కట్టా రాంబాబు, మంతెన సాయి లచ్చిరాజు, చెన్నం శెట్టి హరి నాయుడు, దూసనపూడి రాంబాబు, కిన్నెర వెంకన్న, గురుగుబెల్లి సత్యనారాయణ, కాగిత బుజ్జి, ఉంగరాల నాగేశ్వరరావు, గంధం బుజ్జి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాన్నా..నేనొచ్చేస్తా" నాటికకు బహుమతులు

విశాలాంధ్ర - పాలకొల్లు : శ్రీకాకుళం రంగ స్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నవంబర్ 4,5,6 తేదీల్లో జరిగిన నాటిక పోటీల్లో చిలకలూరిపేట కు చెందిన అంజన రాథోడ్ ఆర్ట్ క్రియేషన్స్ వారి "నాన్నా.. నేనొచ్చేస్తా" నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించింది. ఈ నాటిక కు ఉత్తమ రచన తాళాబత్తుల వెంకటేశ్వర రావు, ఉత్తమ దర్శకుడు ఆర్.ఎస్.ఆర్ నాయక్, నాటిక లో నటించిన ఎస్. అమృత వర్షిణి ఉత్తమ నటి, హసన్ కు ఉత్తమ సహాయ నటుడు బహుమతులు లభించాయి. ఈ నాటిక మూల కథ గుంటి జయశ్రీ, రచయిత తాళాబత్తుల వెంకటేశ్వర రావు, దర్శకత్వం ఆర్.ఆర్.ఆర్ నాయక్. ఈ నాటిక లో గుడివాడ లహరి, వి.సి.హెచ్ కేశవ్ ప్రసాద్, నాయక్ నటించారు. లీల మోహన్ సంగీతం అందించారు. లావు అనిల్ చౌదరి సెట్, లైటింగ్ అందించారు.

ఇళ్ళ నిర్మాణాలకు వెలుగు రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - లింగపాలెం : ఇళ్ళు మంజూరైన మహిళా లబ్దిదారులు డ్వాక్రాలో సభ్యులుగా ఉన్న వారికి రూ. 35 వేలు చొప్పున రుణాన్ని ఎటువంటి ఆటంకం లేకుండా ఇవ్వాలని ఎంపిడిఓ ఆశీర్వాదం తెలిపారు. రుణాల అందచేతపై వెలుగు కార్యాలయంలో జరిగిన సమీక్షలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. దాదాపుగా మహిళల పేరుతోనే ఇళ్ళు మంజూరయ్యాయని, వీరిలో డ్వాక్రాలో సభ్యులుగా ఉన్న వారికి ఇళ్ళ నిర్మాణానికి ముందుగానే వెలుగు ద్వారా ఇచ్చే రుణాలను ఇవ్వాలని అన్నారు. రుణం తీసుకున్న వారు నిర్మాణాలు చేపట్టకపోతే వారికి ఇచ్చిన ఇంటిని రద్దు చేయటం జరుగుతుందని తెలిపారు. లింగపాలెం మండలంలో ఇళ్ళ నిర్మాణం చేపట్టిన దాదాపు 200 మంది రూ. 70 లక్షలు రుణాలుగా ఇచ్చినట్టు వెల్లడించారు. సమీక్షలో వెలుగు ఎపిఎం కమలాదేవి, స్త్రీ నిధి మేనేజర్ ఆనందబాబు, సిబ్బంది సుధాకర్, బాబురావు, మండల సమాఖ్య నాయకురాలు తొణంకి కుమారి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర- ముసునూరు: ఈనెల 8,9,10తేదీల్లో జరగనున్న వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రమైన ముసునూరులో కరపత్రాలు పంపిణీ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లి మురళి ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామం నుండి రాష్ట్ర, దేశాలవరకు రైతు, వ్యవసాయ రంగాల పై ఆధారపడి వున్నాయన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ రైతులను,వ్యవసాయ కార్మిక వర్గాలను అణగదొక్కుతున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో పిన్నిబోయిన శ్రీనివాసరావు,రెడ్డి తిరుపతిరావు, జానుసు, చార్లెసు, తలకోండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింల ఐక్యతను చాటిన బీబీ నాంచారి నాటకం

విశాలాంధ్ర -భీమవరం: హిందూ ముస్లిం ఐక్యత, మత సామరస్య ఆవశ్యక తను తెలియచేసేలా భీమవరం కళా పరిషత్ వారు ఆదిత్య కళావేదికపై ఆదివారం రాత్రి ప్రదర్శించిన బీబీ నాంచారి నాటకానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. పోసింశెట్టి మురళి నిర్వహణలో ప్రదర్శించిన నాటకంలో వెంకటేశ్వర స్వామిగా శ్రీనివాస్, బీబీ నాంచారిగా జ్యోతి రాజ్, సుల్తాన్గా పింక్ విజయ్ కుమార్ తమ పాత్రలకు జీవం పోయగా ఇతర పాత్రల్లో మాదిరెడ్డి శ్రీనివాస్, లక్ష్మణ స్వామి, రమణ, అంజలి, డి.ఎస్.ఎస్. ఫణి కృష్ణ, పి.మాధవరావు, డి.సత్యనారాయణ, శాంతారావు, ప్రకాశరావు తదితరులు ఒకరితో ఒకరు పోటీపడి నటించారు. హైదరాబాద్ సురభి కళాకారులు స్టేజీపై వేసిన ప్రత్యేక సెట్లు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భీమవరం పరిసర ప్రాంత కళాకారులతో ప్రదర్శించిన ఈ నాటకం ఒక కొత్త ప్రయోగమని విమర్శకులు ప్రశంసించారు. స్వర్గీయ ఎ.శ్రీధర్ అందించిన మూలకథకు తిరుమల కామేశ్వరరావు నాటీకరణ దర్శకత్వం అందచేయగా, పద్యాలను ఆదిపట్ల పట్టాభి రామయ్య ఆలపించగా, సాంకేతిక సహకారాన్ని ఎం.సీతారామ ప్రసాద్ అందచేశారు.

పీఎఫ్, ఈఎస్ఐ క్లెయిమ్స్ పరిష్కరించాలి

విశాలాంధ్ర -భీమవరం: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నిరక్షరాస్యత, అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారి పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ క్లెయిమ్స్ ను చెల్లించక పోవడం దారుణమని వాటిని వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఎ.పి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కిలారి మల్లేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య కార్మికుల పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ క్లెయిమ్స్ ను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి అధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సోమవారం స్పందనలో ఆర్డీఓ దాసి రాజు కు వినతిపత్రం అందజేశారు. పిఎఫ్, ఇఎస్ఐ క్లెయిమ్స్ లను పదవీ విరమణ పొందిన కార్మికులు గాని విధుల్లో మృతి చెందిన కార్మికుల వారసులు గాని పొందలేకపోతున్నారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారు శివ, బి.సత్యనారాయణ, శివ ప్రసాద్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని, దళితులకు రక్షణ కల్పించాలని టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నెల 30వ తేదీన కొమడవోలు గ్రామంలో వలంటీర్ రాకేష్‌పై అగ్రవర్ణాల పెత్తందారులు, దురహంకారులు దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నించిన దోషులపై హత్య కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న బాలాజీ మాట్లాడుతూ రాకేష్ పై హత్య చేయడానికి ప్రయత్నించిన అగ్రవర్ణ భూస్వాములపై పోలీసులు కేవలం ఎస్సి అట్రాసిటీ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రాకేష్ పై దాడి చేసిన దోషులపై హత్య కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, ఏలూరు మండల అధ్యక్షులు నేతల రవి, మాజీ ఎంపీపీ ఎం మాణిక్యాలరావు, అలాగా రవికుమార్, కందుల రమేష్, వివిధ డివిజన్లలో వచ్చిన దళిత, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత వైసీపీదే

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరుశాతం నెరవేర్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే చెల్లుతుందని ఎంఎల్ఏ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సింగరాయ పాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం 98వ రోజు నిర్వహించారు . స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి డీఎన్నార్ , నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గడపగడపకు వెళ్లారు .దేశ చరిత్రలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు మరి కొన్ని పథకాలు ప్రవేశపెట్టి ప్రజారంజక పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మరో అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కారు, రెండు ద్విచక్ర వాహనాల సీజ్

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఈ బి సి ఐ ఎస్ మణికంఠ రెడ్డి తెలిపారు ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర సరిహద్దు జీలుగుమిల్లి చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి వేరు వేరు కేసులలో మూడు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనాల తనిఖీలలో భాగంగా ఒక కారు రెండు ద్విచక్ర వాహనాలలో ఆపి తనిఖీ చేస్తుండగా వాటిలో మద్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ మూడు కేసులలో 16 మద్యం సీసాలను, వాహనాలను సీజ్ చేసి జంగారెడ్డిగూడెం ఎస్ఈబి స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు ఈ తనిఖీలలో ఎస్ఈబి ఎస్సై రమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

9న బ్రౌనింగ్‌లో జిల్లా స్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

విశాలాంధ్ర -భీమవరం: 9వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు తమ కళాశాలలో అండర్-19 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక జరగనున్నాయని బ్రౌనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రంపా ఎలిషా తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్చరీ, షూటింగ్, జిమ్నాస్టిక్స్, రోప్ స్కిప్పింగ్, ఫెన్సింగ్, నెట్ బాల్, మాల్కంబ్ క్రీడల్లో బాలి బాలికలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లకు ఎంపికలు జరుగుతాయన్నారు. సెలక్షన్సు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శులు జయరాజ్, కుమార్ పర్యవేక్షణలో జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనాల్సినవారు 1-1-2004 వ తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలని, ఇంటర్మీడియట్ లోపు చదువుతున్న వారై ఉండాలని ఆసక్తి గల క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్, పదవ తరగతి మార్క్స్ లిస్ట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9885886722 నెంబరులో సంపాదించాలని ఆయన తెలిపారు.

వ్యాపార అభివృద్ధికి నమ్మకమే పెట్టుబడి

విశాలాంధ్ర -కైకలూరు : మారుతీ హైడ్రాలిక్ ఫోమ్ వాష్ సర్వీసింగ్ సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతున్నానని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. కైకలూరు పట్టణంలోని బస్ స్టాండ్ పక్కన మెకానిక్ జానపాల శివ నూతన మారుతి హైడ్రాలిక్ ఫోమ్ వాష్ సర్వీసింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధికి నమ్మకమే పెట్టుబడి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయులు,దూలం ఆది వినయ్ కుమార్,దూలం శ్యామ్ ఫణి కుమార్,సర్పంచ్ డిఎం.నవరత్నకుమారి, టౌన్ సిఐ ఎంవిఎస్ నాగరాజు, షేక్ రఫీ,నిమ్మల సాయిబాబు,అబ్దుల్ హమీద్,దండే రవిప్రకాష్,బోడిచర్ల సురేష్,గుర్రం శ్యామ్, పంజా నాగు, సమయం అంజిబాబు, షేక్ ముషా,తులసి పూర్ణ,జక్క రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం సందర్బంగా కిక్కిరిసిన శివాలయాలు

విశాలాంధ్ర - భీమడోలు : కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా భీమడోలు మండలవ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి .భీమడోలు శ్రీభీమేశ్వరస్వామి ఆలయం, పోలసానిపల్లి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, గుండుగొలను శ్రీభ్రమరాంబ మల్లే శ్వరస్వామి ఆలయం, అంబరుపేట శ్రీఉమారామలింగేశ్వరస్వామి, పూళ్ల శివాలయంలో భక్తులు తెల్లవారుజాము నుండి క్యూలైన్లలో బారులు తీరారు. విశేష పూజలు అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భీమడోలు శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కాళ్లకూరి ఉమా విజయశంకరశర్మ ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.. ఆలయం ఆవరణలో భక్తులు దీపాలు వెలిగించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయకమిటీ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసారు.

స్టేట్ బ్యాంక్ అందించే సేవలను శ్రీ రామ చంద్ర గ్రూపు సంస్థల ద్వారా పొందవచ్చు

విశాలాంధ్ర-టి.నరసాపురం : జంగారెడ్డిగూడెం స్టేట్ బ్యాంక్ అందించే సేవలను శ్రీ రామ చంద్ర గ్రూపు సంస్థల ద్వారా పొందవచ్చునని ఆ సంస్థల చైర్మన్ బి వి కృష్ణా రావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో జంగారెడ్డిగూడెం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీ రామ చంద్ర గ్రూపు సంస్థలు సంయుక్తంగా ఖాతాదారుల అవగాహనా సదస్సు సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కృష్ణా రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు,వ్యాపారులు,ఉద్యోగులు బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు,సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ, కొత్త ప్రకాష్ బాబు, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ నారాయణ రావు,ఫీల్డ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్య, వివిఎస్ జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 11 ఫిర్యాదులు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనకు 11 ఫిర్యాదులు వచ్చాయని వాటిని వెంటనే పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ యు. రవిప్రకాష్ సూచించారు సోమవారం ఆయన పోలీస్ క్యాంప్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశారు .మీ స్పందనకు సివిల్, అత్తింటి వేధింపులు ,సరిహద్దు తగాదాలు, తదితర ఫిర్యాదులు అందాయని పోలీసు వర్గాలు తెలిపాయి.

విపత్తు నష్టాల నివారణకు వలంటీర్లు

విశాలాంధ్ర-ఏలూరు : జిల్లాల్లో విపత్తుల వలన కలిగేనష్టాలను నివారించేందుకు క్షేత్రస్థాయిలో ఆపదమిత్ర వాలంటీర్లను ప్రభుత్వం సిద్ధం చేస్తున్నదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ (ఎపిఎస్ఐఆర్డిపిఆర్) డైరెక్టర్ జె. మురళి అన్నారు. సోమవారం ఏలూరు జె.వి.ఆర్. నగర్ లోని సోషల్ సర్వీస్ సెంటర్ లో జిల్లా పంచాయితీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆపదమిత్ర వాలంటీర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఎపిఎస్ఐఆర్డిపిఆర్ డైరెక్టర్ జె. మురళి, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపదమిత్ర కరదీపికను పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపిఎస్ఐఆర్డిపిఆర్ జె. మురళి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో కమ్యూనిటీ ఆధారిత సన్నద్ధత, ప్రణాళిక ప్రమాదం, ప్రభావాలను తగ్గించడానికి, సహాయం అందించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఏ విపత్తు సంభవించినా ప్రాణనష్టం జరగకుండా చూసేందుకు కమ్యూనిటీ భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 5 మండలాలకు చెందిన 100 మందికి 12 రోజులు పాటు సమగ్ర శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా తొలి 10 రోజులు శిక్షణ అందించడంతోపాటు మిగిలిన 2 రోజులు తుఫాను, వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహించి అవసరమైన శిక్షణ అందించనున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలు విపత్తుల ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల ప్రజలకు తగిన ప్రాథమిక అవగాహన కల్పించేందుకు ఆపదమిత్ర శిక్షణ తరగతులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. 'ఆపదమిత్ర' కార్యకర్తలకు భీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ డిటిఎం జి. ప్రసంగిరాజు, డిపిఎం రత్నబాబు, ప్రభృతులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంతోనే అభివృద్ధి

విశాలాంధ్ర- తణుకు: స్థానిక మాంటిస్సోరి స్కూలులో సోమవారం నోబెల్ బహుమతి గ్రహీత సర్. సి. వి రామన్ జన్మదిన దినోత్సవం సందర్భంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వందల ప్రదర్శనలను ఇచ్చారు. ఈ కార్యక్రమానికి నీతి అయోగ్ ఇన్నోవేషన్ మిషన్ సంకురాత్రి గంగాదర శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల గురుంచి, అందు సర్. సి. వి. రామన్ కృషి గురించి మాట్లాడారు. కోర్ సైన్స్ పట్ల ఆసక్తి పెంచడం కొరకు ప్రదర్శనలు నిర్వహించామని, సమాజంలో సామాజిక సమస్యల పట్ల అవగాహన పెంచి వాటి పరిష్కార మార్గాలను కనుగొనే దశలో, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి శాస్త్ర సాంకేతిక రంగాల మీద ఆధారపడి ఉందన్న విషయంలో తర్ఫీదు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శివనామంతో మారుమోగిన శోభనగిరి

విశాలాంధ్ర- ఆగిరిపల్లి: శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీనరసింహ స్వామి గిరి పైన స్వయంభు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వెలసి ఉన్న కార్తీక సోమవారం పర్వదినమున భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం సోమవారము పౌర్ణమి సందర్భంగా దుర్గా మల్లేశ్వరిని సన్నిధానంలో ప్రత్యేకమైన అభిషేకాలు, స్వామివారికి పుష్పములతో, బిల్లా పత్రము పారజాతము పూలతో స్వామివారిని అలంకరించి దీపారాధన కార్యక్రమం జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు మూర్తి తెలిపారు. భక్తులకు వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి కొండపైన స్వయంభు వెలిసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాసం సందర్భంగా అభిషేకాలు దీపారాధన పూజలు చేయటం వలన పరమశివుని కటాక్షం పొందుతారని భక్తులకు నమ్మకం, శోభనగిరి కొండపైన 780 మెట్లు మెట్లు పూజ చేసుకుంటూ గోవింద నామముతో , శివపార్వతి నామముతో కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. దుర్గా మల్లేశ్వర స్వామి ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు మూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పలు శివదీక్షపరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునిగా వేణు

విశాలాంధ్ర-ముసునూరు:ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల మన్నన లను పొందితే ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలిచిపోతాడని భారతి విద్యా నికేతన్ ప్రిన్సిపాల్ కోండేటి శౌరి అన్నారు.సోమవారం మండల కేంద్రమైన ముసునూరు భారతి విద్యానికేతన్ పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న నక్కనబోయిన వేణు లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకున్నారు.

పాత సామాగ్రి బహిరంగ వేలం

విశాలాంధ్ర-టి.నరసాపురం : అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాలకు చెందిన పాత సామాగ్రిని నిర్ణయించబడిన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన బహిరంగ వేలము వేయనున్నట్లు ప్రిన్సిపాల్ టి. నరసింహస్వామి తెలిపారు. స్థానిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పాతఇనుము, ఇత్తడి, అల్యూమినియం, స్టీల్, విద్యుత్,ఎలక్ట్రానిక్ పరికరాలు వేలము వేయనున్నామని ఆశక్తి గల కొనుగోలు దారులు ప్రిన్సిపాల్ అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల పేరున ఉన్న జంగారెడ్డిగూడెం స్టేట్ బ్యాంకులో చెల్లుబాటు అగునట్లు 5000 రూపాయలు డీడీ రూపంలో ధరావత్తు జమచేయవలెనని తెలిపారు. డి డి లను వేలం నోటీపై చేసిన ఈ నెల 8వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఆఫీసు పని వేళల్లో అందజేయాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 9866559625 నెంబర్ కు ఫోన్ చేసి సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

విశాలాంధ్ర-చాట్రాయి: బలహీన వర్గాల నివాస ప్రాంతంలో మెరుగైన తాగునీరు అందించడం కోసం పైప్ లైన్ పనులు ప్రారంభించినట్లు వైసీపీ మండల సీనియర్ నాయకులు దామెర ప్రసాద్ బాబు తెలిపారు. మండల కేంద్రమైన చాట్రాయి పంచాయతీ గొల్లగూడెంలో తాగునీటి సౌకర్యం మెరుగు పరచడంకోసం రూ.10 లక్షల అంచనాలతో మంజూరైన పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నిత్యం ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, వైసీపీ నాయకులు సంకు సత్యనారాయణ, నెల్లూరు సత్యనారాయణ, వార్డు సభ్యులు నరసింహ రావు, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో అక్రమ కట్టడాలు

విశాలాంధ్ర - పాలకొల్లు : మండలంలోని పాలమూరు గ్రామంలో హైకోర్టు ఇచ్చిన స్టేనే ధిక్కరించి, పంచాయతీ స్థలంలో వైసీపీ నాయకుల అండతో అక్రమ కట్టడం పనులు నిర్వహిస్తున్నారని పాలమూరు గ్రామ సర్పంచ్ పి వి ఎస్.వి.ఎస్ స్వామి నాయుడు విమర్శించారు.పాలకొల్లు రూరల్ మండలం పాలమూరు గ్రామంలో పంచాయతీకి సంబంధించిన స్థలంలో పంచాయతీ తీర్మానం లేకుండా అధికార వైసిపి నాయకులు అండదండలతో అక్రమ నిర్మాణాన్ని చేపట్టిన విషయంపై సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయితీ అనుమతి లేకపోవడంతో సర్పంచ్ పి వి ఎస్వీఎస్ స్వామి నాయుడు స్పందన కార్యక్రమంలోనూ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే పొన్నాడ ఎస్సీలకు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - అమలాపురం : ముమ్మిడివరం మండలం అన్నంపల్లి గ్రామంలో ఎస్సీలను కించపరిచేలా శిలాఫలకం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ వెంటనే ఎస్సిలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మున్సిపల్ మాజీ చైర్మన్ చెల్లి అశోక్ డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు మిమ్మితి చిరంజీవి అధ్యక్షతన సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మున్సిపల్ మాజీ చైర్మన్ చెల్లి అశోక్ మాట్లాడుతూ ఇటీవల అన్నంపల్లి గ్రామంలో జల మిషన్ ద్వారా నీటి పథకానికి జరుగుతున్న శంకుస్థాపన శిలా ఫలకంలో మాలపల్లి అని శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడం దానిని పొన్నాడ సతీష్ కుమార్ ప్రారంభించడం ఎస్సీలను అవమానపరచడమేనని అన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ఎస్సీలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

నాణ్యమైన పాలు అందించడమే జగనన్న పాల వెల్లువ ఉద్దేశం

విశాలాంధ్ర - గోపాలపురం : నాణ్యమైన ఆరోగ్యదాయకమైన పాలను అందించటమే జగనన్న పాల వెల్లువ ముఖ్య ఉద్దేశ్యం అని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సత్య గోవింద్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీడీవో ఆర్.శ్రీదేవితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21వ తేదీలోగా ఫేస్ టూ లో భాగంగా తాళ్లపూడి గోపాలపురం మండలాలలో అమూల్ కంపెనీ ద్వారా పాలు సేకరించినందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకుగాను మంగళ బుధ గురు వారాలలో మండలంలోని 18 గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి, మండల పరిధిలో 15 అమూల్ పాల కంపెనీ ద్వారా ఆయా గ్రామాల్లోని పాల సేకరణ కేంద్రాల ద్వారా పాలు సేకరించి దానిని బల్కనీల్ కు సెంటర్లకు తరలించినట్లు తెలిపారు. ఈయన వెంట గోపాలపురం పశు వైద్యాధికారి దరిస్ బాబు ఉన్నారు.

ఎంపీపీ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - దేవరపల్లి : మండల పరిషత్ అధ్యక్షులు కె వి కే దుర్గారావు జన్మదిన వేడుకలు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాల యానికి ఎంపీపీ దుర్గారావు రాగానే సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం కేక్ కట్ చేసి అధికారులు ప్రజా ప్రతినిధులు దుర్గారావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్, ఏఎంసీ చైర్మన్ జై జనార్దన్ రావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రామకృష్ణ, దేవరపల్లి సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, జెడ్పీటీసీ స్వర్ణలత, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎన్ రాజేంద్ర బాబు, వైస్ ఎంపీపీ ఎస్.సుబ్బారావు, వైసీపీ నేతలు పచ్చ రాంగోపాల్, డి. గంగాధర్, గడ రాంబాబు, దుద్దుకూరు సొసైటీ అధ్యక్షులు కె.రామకృష్ణ, గౌరీపట్నం సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ అచ్యుతరావు, మాజీ ఎంపీటీసీ కడిమి రాజు, ఎంపీటీసీలు ,సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిత్యలో ఘనంగా ముగిసిన శ్రీశత చండీ మహాయాగం పూజలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలు ఆధ్యాత్మిక ప్రాంగణం శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయం నందు పంచాహ్నిక దీక్ష చతుర్వేద పారాయణం పురస్సర శ్రీ శత చండీ మహాయాగం గురువారం సోమవారం వరక విజయవంతగా ముగిసింది. యాగ బ్రహ్మ కందర్ప వేంకట శ్రీరామ శర్మ ఆధ్వర్యంలో శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి ఆలయం లో పంచాహ్నిక దీక్ష చతుర్వేద పారాయణం పరస్పర శ్రీ శత చండీ మహాయాగం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ దైవ సంకల్పంతో కుటుంబ సభ్యుల అనుమతితో రుత్విక్‌ల సహకారంతో ఈ మహా యాగం విజయవంతంగా జరపడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆదిత్య అధినేతలు డా నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మి రాజ్యం దంపతులు, విద్యాసంస్థల వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి శృతి రెడ్డి, దంపతులు, విద్యాసంస్థల సెక్రటరీ నల్లమిల్లి కృష్ణ దీపక్ రెడ్డి, డా సుగుణ రెడ్డి, దంపతులు, చైతన్య గ్రూప్ ఆఫ్ అధినేత చింతా వెంకటరెడ్డి దంపతులు పాల్గొని పూజా విధులు నిర్వహించారు.

నేత్ర దానం చేయండి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : పోలీసు స్టేషన్, యం. పి.డి.ఓ కార్యాలయం లో నేత్రదానం పోస్టర్ ఆవిష్కరణ చేస్తూ నేత్ర దానం చేయుట వలన కొందరి జీవితాలలో వెలుగులు నింపవచ్చ ని ఎస్ ఐ రమణ అన్నారు. నేత్ర దానం కొరకు పోలీసు శాఖ ముందుకు వచ్చిందని ప్రజలందరూ పాల్గొని 13 వ తేదీ ఆదివారం సొలస దమయంతి కళ్యాణ మండపంలో కార్నియా దానం చేసినట్లు సర్టిఫికెట్ పొందండి అని మానవత అధ్యక్షులు జోడాల కోరారు. ఈ కార్యక్రమం లో స్టేషన్ కానిస్టేబుల్స్ దాస్,శేఖర్,గణేష్ తాళ్లపూడి యం. పి.పి జొన్నకూటి పోసిరాజు, ప్రక్కిలంక సీనియర్ నాయకులు యాళ్ల బాబూరావు, గూడా విజయరాజు, నాగేంద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వే

విశాలాంధ్ర - భీమవరం : జాతీయ కుష్టు నివారణ కార్యక్రమం కింద లెప్రసి కేస్ డిటెక్షన్ సర్వే ఈనెల 15 నుండి డిసెంబర్ 05 వ తేదీ వరకు జిల్లాలో ఇంటింటి సర్వే ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వాలంటీర్ల ద్వారా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయం ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో జిల్లా కోఆర్డినేషన్ సమావేశం జిల్లా కలెక్టరు నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జాతీయ కుష్టు నివారణ కార్యక్రమం కింద జిల్లాలో ప్రతి ఇంటింటా,ప్రతి పాఠశాలల్లోనూ, అంగన్వాడీల్లోనూ, వసతి గృహాల్లో కూడా సర్వే నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టరు డి. మహేశ్వర రావు , అడిషినల్ డిఎంహెచ్ ఓ బి.భానూ నాయక్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - గణపవరం: కిడ్నీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమవరం అశోక్ కిడ్నీ సెంటర్ హాస్పిటల్ డాక్టర్ భూపతిరాజు అశోక్ వర్మ అన్నారు. ది పి ఎం పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా గణపవరం మండల యూనిట్ ఆధ్వర్యంలో గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో మండల పి ఎం పి అధ్యక్షులు మండా సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన మెగా ఉచిత కిడ్నీ మెడికల్ క్యాంపు జరిగింది.ఈ క్యాంపులో సుమారు 125 మంది రోగులకి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సంజయ్ కుమార్ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పి ఎం పి జిల్లా అధ్యక్షులు ఏ ఆర్ కే పరమేశ్వర్లు, సిహెచ్ ప్రభాకర్ రావు, కె అప్పారావు, మస్తాన్ వలి, కొండలరావు, వి శివ శ్రీనివాసరావు, పీఎంపీ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - పాలకొల్లు : సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఉషా లక్ష్మి అన్నారు. సోమవారం పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరులందరూ కళ్ళ పట్ల శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకుని కంటి చూపు నాణ్యతను పరీక్షించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 20 మందికి మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భాను సాయి, స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ మంగతాయారు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి వి సుబ్బారావు పాల్గొని రోటరీ సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, మద్దాల రాంప్రసాద్, ఇమ్మిడి రాజేష్, కటారి నాగేంద్ర, దశక శేషగిరి, శ్యాంబాబు,సభ్యులు ప్రభాకర్, భీమన్న, సరేంద్ర ప్రసాద్,శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు. నేత్ర కంటి ఆసుపత్రి టెక్నీషియన్స్ వెంకటేశ్వరరావు, ధనలక్ష్మిలు కంటి పరీక్షలు నిర్వహించారు.

నాణ్యమైన చేపలు అందించాలి

విశాలాంధ్ర - గోపాలపురం : వినియోగదారులకు నాణ్య మైన చేపలను తక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో ఫిష్ మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ల ఏర్పా టుకు రాష్ట్ర ప్రభు త్వం శ్రీకారం చుట్టిందని మత్స్య శాఖ సహాయ సంచాలకులు సైదా నాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని బీమోలు గ్రామంలో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్లను మరియు ప్రదాన మంత్రి మత్స్య సంపద యోజన పథకములను గూర్చి అవగాహన కల్పించారు. ఒక యూనిట్ ఖరీదు 3 లక్ష ల 25 వేలు రూపాయలు అవు తుందన్నారు. ఈయూనిట్ ఏర్పాటు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం బి. సి. లకు 40 శాతం, ఎస్. సి., ఎస్. టి. లకు 60 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మత్స్యకారులు కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతొందన్నారు. లైవ్ చేపలను లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇవ్వడం జరుగుతుంద న్నారు.లైవ్ చేపలను లబ్ధిదా రులకు ఇవ్వడం వల్ల ఆరోగ్యం గా ఉంటారన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కొత్తగా మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ల మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్లు తీసుకువచ్చిందన్నారు.

కొసరాజు చిత్రపటం వద్ద మోరంపూడి నివాళి

విశాలాంధ్ర - చాట్రాయి : టీడీపీ కార్యకర్త కీర్తిశేషులు కొసరాజు సత్యనారాయణ చిత్రపటం వద్ద తెలుగు రైతు ఏలూరు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. చాట్రాయి మండలం పోతనపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కొసరాజు సత్యనారాయణ కుటుంబాన్ని మోరంపూడి పరామర్శించారు. కుమారుడు అబ్బుల్ చౌదరిని ఓదార్చి ధైర్యంచెప్పారు. పార్టీ అండగా వుంటుందన్నారు. కోటపాడులో రావి శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. చనుబండ లో అనుమోలు సత్యనారాయణ భౌతికకాయం వద్ద నివాళిఅర్పించారు. ఈకార్యక్రమంలో మంచిన పూర్ణచంద్రరావు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చింతలపూడి శాసనసభ్యులు ఎలిజా అన్నారు. పట్టణంలోని 14వ వార్డు రామచంద్రపురం లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని,ప్రజల ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు.ఆ వార్డులో ఉన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి,కమీషనర్ పి.భవానీ ప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు పి.పి.ఎన్.చంద్రరావు,స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ వందనపు సాయి బాల పద్మ,14వ వార్డు కౌన్సిలర్ తాతకుంట్ల వెంకట లక్ష్మి,కౌన్సిలర్లు నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గా ప్రసాద్,ఎల్.వి.ఆర్.,చిటికెల అచ్యుత రామయ్య,కో ఆప్షన్ సభ్యుడు వెంపా ఐజాక్,మున్సిపల్, సచివాలయ సిబ్బంది,వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవోపేతంగా కార్తీక పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర - వీరవాసరం : కార్తీకమాసం రెండవ సోమవారం, కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయాలన్నీ శివనామస్మరణతో మారుమ్రోగాయి. వీరవాసరంలోని శ్రీ వీరేశ్వర, విశ్వేశ్వర, సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం, రాయకుదురు శ్రీ ఉమా మూలేశ్వర స్వామి వారి ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేకపూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. కార్తీక సోమవారం అభిషేకాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పంచామృత అభిషేకాలు, పూజలను నిర్వహించారు.